వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూడాలి



నీటి సమస్యపై ప్రజలను అడిగి తెలుసుకుంటున్న కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్

కాచిగూడ: వేసవిలో నీటి సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమారమేష్ యాదవ్ జలమండలి అధికారులకు సూచించారు. బుధవారం స్థానిక బీజేపీ నేతలతో కలిసి కార్పొరేటర్ కాచిగూడ డివిజన్‌లోని ఇందిరానగర్, నింబోలిఅడ్డ, చెప్పల్‌బజార్, బండలబస్తీ, మౌలానా ఆజాద్‌నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న నీటి సమస్యను అడిగి తెలుసుకున్నారు. ఒక్కోసారి కలుషిత తాగునీరు సరఫరా అవుతోందని, లోప్రెషర్‌తో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోయారు. బోర్‌వెల్స్ సరిగ్గా పనిచేయకపోవడంతో సమస్య అధికంగా ఉందని ప్రజలు కార్పొరేటర్‌కు వివరించారు. ఈ సమస్యలను జలమండలి జనరల్ మేనేజర్, డీజీఎం, మేనేజర్‌ల దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కరించేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. బీజేపీ నేతలు మల్లికార్జున్, భీమ్‌రాజ్, రమాదేవి, వెంకటేష్, రాజ్‌కుమార్, నాగరాజు, ఇందిర, రవియాదవ్, ప్రవీణ్, శైలేందర్, రాము, దినేష్, మురళి తదితరులున్నారు.

రూ.8 లక్షలతో అభివృద్ధి పనులు



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు, కార్పొరేటర్ లావణ్య

కాచిగూడ: గోల్నాక డివిజన్ సుందర్‌నగర్ బస్తీలో రూ.8 లక్షలతో నూతనంగా ఏర్పాటు చేయనున్న డ్రైనేజీ పైప్‌లైన్ పనులను ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ కార్పొరేటర్ లావణ్యశ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా బుధవారం బస్తీలో పర్యటించిన ఎమ్మెల్యే ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోడ్లు, వీధి దీపాల సమస్యను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. డివిజన్‌లో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల గురించి అధికారులు, స్థానిక నేతలతో ఎమ్మెల్యే చర్చించారు. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలపై దృష్టిసారించాలన్నారు. బస్తీలు, కాలనీల్లో డ్రైనేజీ, తాగునీటి పైపులైన్ల నిర్మాణం, నూతన రోడ్ల ఏర్పాటు, వీధి దీపాలు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కలుషిత తాగునీటి సమస్య, లో ప్రెషర్ సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. బీఆర్‌ఎస్ నేతలు శేషు, కాలేరు రామకృష్ణ, భరత్‌రాజ్, కాలేరు రాజు, బాలరాజు, లక్ష్మి, ఆర్.కె.బాబు తదితరులున్నారు.

క్లుప్తంగా

పంచాంగం ఆవిష్కరణ



నల్లకుంట: చండీ పరమేశ్వర పీఠాధిపతి డాక్టర్ అవసరాల ప్రసాద్ శర్మ సిద్ధాంతి చేతుల మీదుగా (శోభకృత్ నామ సంవత్సరం) 2023–24 పంచాంగాన్ని ఆవిష్కరించారు. రాష్ట్ర పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తన నివాసంలో పంచాంగ పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి(టీబీఎస్‌ఎస్) ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు ఉపేంద్రశర్మ, అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు, ప్రచార కార్యదర్శి బాలచంద్రశర్మ, అర్చక సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు



అంబర్‌పేట: ప్రజా సమస్యలను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం చేయవద్దని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. బుధవారం అంబర్‌పేట డివిజన్ బాపూనగర్‌లో స్థానిక కార్పొరేటర్ విజయ్‌కుమార్ గౌడ్ ఇతర అధికారులతో కలిసి ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు డ్రైనేజీ, సీసీరోడ్ల నిర్మాణ పనుల్లో జాప్యం, చెట్లకొమ్మల వంటి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాలని అధికారులను ఆదేశించారు. ఈఈ వీర్రాజు, అధికారులు, స్థానిక బీఆర్‌ఎస్ నేతలున్నారు.

ప్రశ్న పత్రాల లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

ముషీరాబాద్: ప్రశ్న పత్రాల లీకేజీ టీఎస్‌పీఎస్సీ కార్యాలయం నుంచే లీకైన నేపథ్యంలో చైర్మన్ జనార్దన్‌రెడ్డి తక్షణమే రాజీనామా చేయాలని బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ ఆరోపించారు. బుధవారం బీసీ భవన్‌లో ఆయన మాట్లాడుతూ.. నిరుద్యోగ యువకులు ఉద్యోగ అవకాశాల కోసం ఎదురు చూస్తుంటే.. వచ్చిన నోటిఫికేషన్‌లో కూడా ఇలాంటి అవకతవకలకు పాల్పడితే సామాన్య నిరుద్యోగి ఉద్యోగాలు ఎలా సంపాదించాలని ప్రశ్నించారు. పోరాడి సాధించుకున్న తెలంగాణలో పరీక్షలను కూడా సరిగ్గా నిర్వహించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నీల వెంకటేష్, అంజి, నందగోపాల్, సుధాకర్‌ముదిరాజ్, రాజ్‌కుమార్, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం, నిరుద్యోగ యువజన జాక్, యువజన సంక్షేమ సంఘం, బీసీ విద్యార్థి సంఘం తదితర ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

గోన బుద్ధారెడ్డి రచనలు కాకతీయుల కీర్తికి ప్రసిద్ధి

చిక్కడపల్లి: గోన బుద్ధారెడ్డి రచనలు కాకతీయ రాజుల కీర్తి ప్రసిద్ధి కావడానికి ఎంతో దోహదపడ్డాయని తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ ఆయాచితం శ్రీధర్ అన్నారు. చిక్కడపల్లిలో త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో బుధవారం కళాసుబ్బారావు కళావేదికలో గోన బుద్ధారెడ్డి సంస్మరణ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై నివాళులర్పించారు. రంగనాథ రామాయణం కావ్యరచనపై సందేహాలు ఉన్నా.. గోన బుద్ధారెడ్డి కృతికర్తగా సాహితీ పండితులను నిర్ధారించారన్నారు. రంగనాథ రామయణం జానపదశైలిలో పాటలు, దేశీయత ప్రాధాన్యంగా ఉంటుందన్నారు. ముక్తేవి భారతి, చక్రపాణి, శ్రీనివాస్, జగన్మోహన్‌శర్మ తదితరులున్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

కాచిగూడ: రైలు ఢీకొని ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బుధవారం రైల్వే ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. ఫలక్‌నుమా – ఉప్పుగూడ రైల్వే స్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని ఓ వ్యక్తి (40) మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ సోమయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థిని అదృశ్యం

నల్లకుంట: కళాశాలకు వెళ్లిన ఓ ఇంటర్ విద్యార్థిని అదృశ్యమైన ఘటన నల్లకుంట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై కాశయ్య తెలిపిన వివరాల ప్రకారం.. సాయిలు చిన్న కూతురు భవాని (17) బర్కత్‌పురాలోని ఓ కళాశాలలో ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం చదువుతోంది. కాగా ఈ నెల 14న కళాశాలకు వెళ్లిన ఆమె తిరిగి ఇంటికి రాలేదు. బంధువులు, స్నేహితుల వద్ద వాకబు చేసినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో తండ్రి బుధవారం నల్లకుంట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీడీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి: విమలక్క



సమావేశంలో మాట్లాడుతున్న విమలక్క

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బీడీ కార్మికుల సమస్యలను పరిష్కరించి మద్యం ఉత్పత్తులను నిలిపివేయాలని ప్రజా గాయని విమలక్క డిమాండ్ చేశారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలోని ఓంకార్ భవన్‌లో ప్రజా సంఘాల ఉమ్మడి వేదిక ఆధ్వర్యంలో అంతర్జాతీయ శ్రామిక మహిళల పోరాటాల వారోత్సవాల సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బీడీ కార్మికులకు కనీస వేతనాలను అందించి అర్హులైన వారందరికీ జీవనభృతి చెల్లించాలని ఆమె కోరారు. దేశ వ్యాప్తంగా మద్యపానాన్ని నిషేధించాలని డిమాండ్ చేశారు. స్త్రీ విముక్తి కన్వీనర్ పద్మ, మానవ హక్కుల వేదిక అధ్యక్షులు ఎస్.జీవన్‌కుమార్, వివిధ సంఘాల నాయకులు రాకేష్, రాజేశ్వరి, కొమురయ్య, నాగిరెడ్డి, అల్లూరి విజయ, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చండీ హోమం



నల్లకుంట: మూలనక్షత్రాన్ని పురస్కరించుకుని న్యూ నల్లకుంటలోని సీతారామాంజనేయ సరస్వతి ఆలయంలో జ్ఞాన సరస్వతి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బుధవారం ఆలయ ప్రాంగణం యాగశాలలో అర్చకస్వాముల మంత్రోచ్ఛరణల మధ్య కుంకుమార్చన, చండీ హోమం నిర్వహించి భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

నిత్య జనగణమన



నల్లకుంట: శివానంద్‌నగర్‌లో గత 300 రోజులకు పైగా కొనసాగుతున్న నిత్య జనగణమనలో భాగంగా జెండా కార్యక్రమం నిర్వహించారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, అనిల్‌కుమార్ జాతీయపతాకాన్ని ఆవిష్కరించి జాతీయగీతాన్ని ఆలపించారు. నిర్వాహకులు వందే ప్రజ శ్రీనివాస్, ప్రసాద్ దూబే, పోటీ పరీక్షల నిపుణుడు విజయేందర్‌రెడ్డి, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

‘ఎస్సీ వర్గీకరణతోనే మాదిగల అభివృద్ధి’

ముషీరాబాద్: ఎస్సీ వర్గీకరణతోనే మాదిగల అభివృద్ధి సాధ్యమని మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్(ఎంఎస్‌ఎఫ్) జాతీయ అధ్యక్షుడు సోమశేఖర్‌మాదిగ అన్నారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే చట్టబద్ధత కల్పించాలనే డిమాండ్‌తో ఏప్రిల్ 3న బీజేపీ రాష్ట్ర కార్యాలయం ఎదుట మహాధర్నాకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణ మాదిగ పిలుపునిచ్చారన్నారు. 100 రోజుల్లోనే వర్గీకరణ చేస్తామన్న కేంద్ర ప్రభుత్వం 9 ఏళ్లైనా వర్గీకరణ చేయకుండా మాదిగ, ఉప కులాల ప్రజలకు తీవ్ర అన్యాయం చేస్తోందని గజ్జెల రాజశేఖర్ మాదిగ అన్నారు. వర్గీకరణ లేకపోవడంతో మాదిగ విద్యార్థులు, విద్యా, ఉద్యోగ రంగాల్లో తీవ్ర అన్యాయానికి గురవుతున్నారన్నారు. రాష్ట్రంలో ఉద్యోగాల భర్తీ జరుగుతున్న సమయంలో కళ్ల ముందే అవకాశాలు చేజారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంఈఎఫ్ నాయకులు గజ్జెల దయానంద్, ఎంఎస్‌పీ సీనియర్ నాయకులు దుర్గప్రసాద్, ఎల్లయ్య, శ్యామ్‌రావు, దాసరిశ్రీనాథ్, నర్సింగరావు మాదిగ, ఎమ్మార్పీఎస్ ముషీరాబాద్ నాయకులు నాగేందర్‌మాదిగ, ఎంఎస్‌ఎఫ్ నాయకులు తరుణ్, విజయ్‌కృష్ణమాదిగ తదితరులున్నారు.

చలివేంద్రం ప్రారంభం



నల్లకుంట: వేసవిలో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో దోహదపడతాయని నల్లకుంట కార్పొరేటర్ అమృత అన్నారు. మినిస్ట్రీ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం నల్లకుంట కెనరా బ్యాంక్ సమీపంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కార్పొరేటర్ ప్రారంభించారు. గంధం బాలరాజు, బీజేపీ మైనార్టీ మోర్చా మీడియా కన్వీనర్ ఐజాక్‌రాజ్ తదితరులున్నారు.

కుటుంబ సభ్యుల చెంతకు నేపాల్ బాలిక

కాచిగూడ: నింబోలిఅడ్డలోని బాలికల జువైనల్ హోం (బాలికల సదన్)లో ఉన్న నేపాల్‌కు చెందిన మైనర్ వివరాలు తెలుసుకుని బాలికను నెపాల్‌లోని వారి కుటుంబసభ్యుల వద్దకు సురక్షితంగా చేర్చినట్లు మెట్రోపాలిటన్ న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రాధిక జైస్వాల్ ఓ ప్రకటనలో తెలిపారు. రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ పోలీసులు తప్పిపోయిన బాలికను రక్షించి నింబోలిఅడ్డలోని బాలికల సదన్‌లో చేర్పించారు. సంస్థ ప్రతినిధులు బాలిక వివరాలను అడిగి తెలుసుకుని ఈ విషయాన్ని సంస్థ హైదరాబాద్ చైర్మన్, సెషన్స్ జడ్జి పాపిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు.

- బాలిక పూర్తి వివరాలు తెలుసుకుని నేపాల్‌లోని తల్లిదండ్రుల వద్దకు బాలికను చేర్చాలని సెషన్స్ జడ్జి పాపిరెడ్డి సూచించారు. దీంతో జిల్లా సంక్షేమ అధికారి అక్కేశ్వర్‌రావు, విజయ భాస్కర్ బృందం, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ శైలజ, బాలికల పరిశీలన గృహం కృష్ణవేణి, తెలంగాణ రాష్ట్ర చైల్డ్ రైట్ కమిషన్ మెంబర్ అపర్ణ గిరిధర్‌ల సాయంతో బాలికను నేపాల్‌లోని కుటుంబ సభ్యుల వద్దకు చేర్పించేలా తగిన ఏర్పాట్లు చేసినట్లు ఆమె పేర్కొన్నారు.
- బాలిక స్వదేశమైన నేపాల్‌లోని కుటుంబసభ్యుల చెంతకు చేర్పించిన మెట్రోపాలిటన్ న్యాయ సేవాధికార సంస్థ హైదరాబాద్ చైర్మన్, సెషన్స్ జడ్జి పాపిరెడ్డికి, సహకరించిన అధికారులకు బాలిక కృతజ్ఞతలు తెలిపింది.

‘కంటి వెలుగు’ క్యాంప్ ప్రారంభం



కంటి వెలుగు క్యాంప్‌ను ప్రారంభిస్తున్న జిల్లా వైద్యాధికారి వెంకటి

కవాడిగూడ: భోలక్‌పూర్ డివిజన్ పద్మశాలి కాలనీ వెల్ఫేర్ సొసైటీ స్వచ్ఛందంగా ‘కంటి వెలుగు’ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని జిల్లా వైద్యాధికారి వెంకటి అన్నారు. బుధవారం పద్మశాలి కాలనీలో ఏర్పాటు చేసిన కంటివెలుగు క్యాంప్‌ను సొసైటీ సభ్యులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పద్మశాలి కాలనీలో కంటి సమస్యలు రాకుండా ప్రతి ఒక్కరికి ఉచిత కంటి వెలుగు పరీక్షలను నిర్వహించడాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. జిల్లా ఉప వైద్యాధికారి రాజశ్రీ, పద్మశాలి కాలనీ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు సుందర్‌పటాలే, ఆంజనేయులు, కోశాధికారి కమల్‌శర్మ, శ్రీనివాస్‌పటాలే, కో–ఆర్డినేటర్ ఉమాదేవి, స్వప్న, కాలనీవాసులు తదితరులున్నారు.

విద్యార్థులు నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలి

కాచిగూడ: విద్యార్థులు నైపుణ్యాలను మెరుగు పరుచుకోవడం ద్వారానే అవకాశాలను అందిపుచ్చుకునేందుకు అవకాశం లభిస్తుందని శ్యామలదేవి మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వెంకటరమణదేవి అన్నారు. బుధవారం కళాశాలలో టాస్క్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ దీప్తి ఆధ్వర్యంలో విద్యార్థినులకు ‘ప్లేస్‌మెంట్ డ్రైవ్’ను నిర్వహించారు. విద్యార్థులు తమ నైపుణ్యాలను ఎప్పటికప్పుడు మెరుగు పరుచుకోవాలని పోటీ ప్రపంచంలో నైపుణ్యం ఉన్నవారికే ఎక్కువ అవకాశాలు లభిస్తాయన్నారు. రత్న మహిళా డిగ్రీ కళాశాల, నవ చైతన్య డిగ్రీ కళాశాల, విద్యార్థినులు ఈ డ్రైవ్‌లో పాల్గొన్నారు. కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ వసుందర, వైస్ ప్రిన్సిపాల్ లావణ్య కుమారి, శిరీష తదితరులున్నారు.



ప్రిన్సిపాల్ వెంకటరమణదేవి తదితరులు

డిజిటల్ ఆర్థికవృద్ధిలో ఇంటర్నెట్ కనెక్టివిటీ పాత్ర కీలకం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కంట్రోలర్ వందనగుప్తా

కవాడిగూడ: డిజిటల్ ఆర్థికవృద్ధిలో ఇంటర్నెట్ కనెక్టివిటీ ప్రాముఖ్యత ఎంతో గొప్పదని ప్రిన్సిపల్ కంట్రోలర్ ఆఫ్ కమ్యూనికేషన్ అకౌంట్స్ (పీఆర్‌సీసీఏ) వందనగుప్తా అన్నారు. ‘మినిస్ట్రీ ఆఫ్ కమ్యూనికేషన్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్, ‘ప్రిన్సిపల్ కంట్రోలర్ ఆఫ్ కమ్యూనికేషన్ అకౌంట్స్’ తెలంగాణ సర్కిల్ కవాడిగూడ టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ ప్రాంగణం భోలక్‌పూర్‌లో టెలికామ్ ఔట్ రీచ్ ప్రొగ్రామ్ (టీఓపీ)ను నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆమె హాజరై మాట్లాడుతూ.. డిజిటల్ ఇండియా మిషన్‌లో ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్లు పోషిస్తున్న పాత్ర కీలకమని ప్రశంసించారు. కంట్రోలర్ ఆఫ్ కమ్యూనికేషన్ అకౌంట్స్ తెలంగాణ సర్కిల్ ఆర్.కె.సింగ్, జాయింట్ కంట్రోలర్ సంపర్, డిప్యూటీ కంట్రోలర్ సురేఖ, తెలంగాణ సర్కిల్ పరిధిలోని ఐఎస్‌పీలు, టెలికామ్‌శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

యువమోర్చా నేతల అరెస్టు సరికాదు

కాచిగూడ: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నాపత్రాల లీకేజీ దోషులను వదిలేసి.. నిరుద్యోగుల పక్షాన పోరాడుతున్న బీజేపీ యువమోర్చా నేతలను అరెస్టు చేయడం దుర్మార్గమని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతంరావు అన్నారు. బుధవారం బర్కత్‌పురాలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పరీక్షలను సక్రమంగా నిర్వహించడంలో కేసీఆర్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ఈ అన్యాయాన్ని ప్రశ్నిస్తే నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేసి అరెస్టు చేయడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ లీకేజీ ఘటనపై ఉన్నత స్థాయి సమగ్ర విచారణ జరిపించి పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. పోలీసులు అరెస్టు చేసిన యువ మోర్చా నేతలను తక్షణమే బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ నేతలు వనం రమేష్, కేశబోయిన శ్రీధర్, సాయి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఎస్.గౌతంరావు